నమస్తే తెలంగాణ

మహబూబాబాద్

5 | వరంగల్, శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | MAHABUBABAD




సభా స్థలిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌బాబు తదితరులు

## 16 నెలల కాంగ్రెస్ పాలన అట్టర్ ఫ్లాప్

- రేవంత్‌రెడ్డికి తెలంగాణ అంటే ఇష్టం లేదు
- 27న ఎల్కతుర్తిలో లక్షలాది మందితో రజతోత్సవ సభ
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- సభా స్థలిలో ఏర్పాట్ల పరిశీలన
- పాల్గొన్న ఎమ్మెల్సీలు పోచంపల్లి, రమణ, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, వొడితెల, పెద్ది

# మళ్లీ కేసీఆరే రావాలంటున్నరు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 10 : కాంగ్రెస్ ప్రభుత్వ 16 నెలల పాలనను చూసిన ప్రజలు మళ్లీ కేసీఆరే రావాలని కోరుకుంటున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ వ్యతిరేకి అని, రాష్ట్ర ఏర్పాటుకు అడ్డుపడ్డాడే తప్ప ఎప్పుడూ ఉద్యమంలో పాల్గొనలేదన్నారు. అసలు ఆయనకు తెలంగాణ అంటేనే ఇష్టముండదని, మూర్ఖుడు, దొంగ అని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ రజతోత్సవం సందర్భంగా ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న మహాసభ స్థలిలో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఆయన ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సభా ప్రాంగణానికి వచ్చే రహదారులను చూసిన ఆయన నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు, 10 ఏళ్ల కేసీఆర్ పాలనలో పరిస్థితులు ఎలా ఉన్నాయో ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పాలనలో పదేండ్ల క్రితం నాటి దుస్థితి దాపురించిందని విమర్శించారు. తాగు, సాగు నీళ్లు లేక ప్రజలు అల్లాడుతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ చేస్తామని, రైతుభరోసా ఇస్తామని ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. మొన్నటి వరకు పచ్చగా కళకళలాడిన పల్లెలు నేడు కళావిహీనంగా మారాయన్నారు. ఎండిపోయిన, వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డికి ఎప్పుడు ఏ భూమి అమ్ముదామా అనే ఆలోచన తప్ప పాలనపై పట్టు లేదన్నారు. ఉద్యమ సమయంలో ఎంతో మంది విద్యార్థులు, ప్రజలు ఆత్మహత్య చేసుకోవడంతో పాటు కేసుల పాలయ్యారన్నారు. కేసీఆర్ ప్రాణాలకు తెగించి కొట్లాడితేనే తెలంగాణ సిద్ధించిందని తెలిపారు. తెలంగాణ రాకముందు నీళ్లు, నియామకాలు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, కాళేశ్వరం, ఆసరా పింఛన్లు లాంటి పథకాలున్నాయా అని ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ప్రజలకు కాంగ్రెస్ మోసాలను వివరించి వారిని జాగృతం చేయడానికే ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. తొలుత 5-6 లక్షల మంది వస్తారని అంచనా వేశామని, ఇప్పుడు 11లక్షల వరకు ప్రజలు తరలివచ్చే అవకాశముందన్నారు. కొన్ని ప్రాంతాల్లో చందాలు వేసుకొని సభకు వచ్చేందుకు ప్రజలు ఉత్సాహం చూపడం హర్షణీయమన్నారు. వరంగల్-కరీంనగర్-సిద్దిపేట రూట్లలో పెద్ద ఎత్తున పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నామని, యుద్ధప్రాతిపదికన సభా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. సభకు వచ్చే ప్రతి ఒక్కరికీ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎర్రబెల్లి పేర్కొన్నారు. ఆయన వెంట కార్పొరేషన్ల మాజీ చైర్మన్‌లు వాసుదేవారెడ్డి, ఎల్లావుల లలితాయాదవ్, వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, పార్టీ మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్, నాయకులు తంగెడ మహేందర్, గొల్లె మహేందర్, దేవేందర్‌రావు, గొడిశాల వినయ్, జూపాక జడ్సన్, చిట్టిగౌడ్, ఉట్కూరి కార్తీక్, ఎండీ మదార్, రాజేశ్వర్ రావు, సతీశ్ పాల్గొన్నారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, పక్కన ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, నాయకులు

# మానుకోట సత్తా చాటుదాం

- వేలాదిగా రజతోత్సవ సభకు తరలిరావాలి
- తమ ఇంట్లో పండుగలా భావించి కార్యకర్తలు విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

మహబూబాబాద్ రూరల్/గూడూరు, ఏప్రిల్10: బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభలో మానుకోట సత్తా చాటాలని, వేలాదిగా స్వచ్ఛందంగా తరలిరావాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. గురువారం మహబూబాబాద్, గూడూరు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాల్లో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌తో కలిసి సన్నాహక సమావేశాల్లో పాల్గొని సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సత్యవతి మాట్లాడుతూ ఈనెల 27న ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ పార్టీ 25 వసంతాల సభను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయని అన్నారు. ముఖ్య నాయకులు, కార్యకర్తలు తమ ఇంట్లో పండుగలా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే పరిస్థితి లేదని, ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే బీఆర్‌ఎస్ పార్టీదే అధికారమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఖతమైందని, ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు కూడా నిర్వహించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను కార్యకర్తలు, నాయకులు ప్రజలకు వివరించాలని, గ్రామాల్లో చర్చ జరగాలని అన్నారు. గత పదేళ్లలో మానుకోట నియోజకవర్గం శంకర్‌నాయక్ హయాంలో ఎంత అభివృద్ధి చెందిందో ప్రజలు చెబుతున్నారని, 15 నెలల్లో ఎంత అభివృద్ధి జరిగిందో మురళీనాయక్ చెప్పాలని అన్నారు. పనులు చేయక పోవడం వల్ల గ్రామాల్లో ఎమ్మెల్యేలు తిరిగే పరిస్థితి లేదన్నారు. గ్రామాలు, తండాల్లో ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని పేర్కొన్నారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు మహబూబాబాద్‌కు వారానికొకసారి వచ్చి అభివృద్ధి పనుల్లో పాల్గొన్నామని, నేటి వరకు మహబూబాబాద్‌కు ఎంత మంది మంత్రులు వచ్చారో కాంగ్రెస్ నాయకులు చెప్పాలని అన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో మానుకోటకు ఒక పేజీ ఉందని, అదేవిధంగా సభను కూడా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహబూబాబా ద్ మున్సిపల్ మాజీ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్, మార్నేని వెంకన్న, యాళ్ల మురళీధర్‌రెడ్డి, తేళ్ల శ్రీను, లునావత్ అశోక్ నాయక్, కన్న, జీ వెంకన్న, రామచంద్రు, నవీన్‌నా యక్, ఖాదర్‌బాబా, సంతోష్, బీఆర్‌ఎస్ గూడూరు మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం సంపత్‌రావు, మాజీ జడ్పీటీసీ ఎంబా ఖాసీం, బానోత్ మోతీలాల్, మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్, నాయకులు కతార్ సింగ్, కాల్సానీ వేణుమాధవరెడ్డి, బోడ కిషన్, చీదురు వెంకన్న, ఏదునూరి వెంకన్న, నర్సింహానాయక్, కోడి రవి, ఎలమందల రవీందర్, సుధాకర్, యాకయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.




### కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

– ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

కాంగ్రెస్ పార్టీ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. గత పదేళ్లుగా రైతులు, మహిళలు, గ్రామాల అభివృద్ధిపై కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ వహించారు. ప్రస్తుతం రైతులు పంటలను అమ్ముకోవడానికి సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ ఒక్క సామాజిక వర్గం కూడా రేవంత్‌రెడ్డి పాలనలో ఆనందంగా జీవించడం లేదు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని గద్దె దించి తిరిగి కేసీఆర్ పాలన తీసుకురావడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి.

### కార్యకర్తల వెన్నంటే ఉంటా

–మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

కార్యకర్తల వెన్నంటే ఉండి కంటికి రెప్పలా కాపాడుకొంటా. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కొంతమంది నాయకులు పదవులు అనుభవించి నేడు పార్టీని బద్నాం చేస్తున్నారు. వారి వక్ర బుద్ధి తెలిసిపోయింది. కష్టపడ్డ కార్యకర్తలు, నాయకులకు పార్టీ గుర్తింపునిచ్చి ఆదుకుంటుంది. కాంగ్రెస్ పార్టీకి ప్రజల సంక్షేమం కోసం పనిచేద్దామనే చిత్తశుద్ధి లేదు. ఏ గ్రామానికి పోయినా సీఎం రేవంత్ రెడ్డి హామీలు ఇచ్చి అమలు చేయలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలి.

- రజతోత్సవ సభకు వచ్చిన జనాన్ని చూస్తే రేవంత్‌రెడ్డి లాగు తడవాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి మండలం కమలాపూర్‌లో రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



# పండుగలా తరలిరావాలి

కృష్ణ కాలనీ, ఏప్రిల్ 10 : రజతోత్సవ సభకు పండుగలా తరలిరావాలని, ఆ ప్రభంజనాన్ని చూసి సీఎం రేవంత్ రెడ్డి లాగు తడిసిపోవాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ భూపాలపల్లి మండల రూరల్ అధ్యక్షుడు పిన్‌రెడ్డి రాజిరెడ్డి అధ్యక్షతన గురువారం కమలాపూర్, నాగారం, ఆజంనగర్, నందిగామ, దీక్షకుంట, పంబాపూర్, దూదేకులపల్లి, గొల్లబుద్ధారం, రాంపూర్ గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాపురం గ్రామంలో భారీ బైక్ ర్యాలీలో పాల్గొని, చలో వరంగల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ పిట్టలదొర రేవంత్ రెడ్డి మాటలు విని కాంగ్రెస్‌ను గెలిపిస్తే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేశాడన్నారు. కేసీఆర్ తనదైన శైలిలో పదేళ్లలో అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించి బంగారు తెలంగాణగా తయారు చేశారన్నారు. ప్రలోభాలకు లొంగిన ప్రజలు కాంగ్రెస్ దొంగలకు పట్టం కట్టి అధికారం ఇస్తే పాలన మరిచి కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులపై తిట్ల దండకం సాగిస్తూ, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఇప్పుడు ఆలోచిస్తున్నారని, కేసీఆర్‌ను వదులుకొని, కమిషన్లతో, కలెక్షన్లతో పరిపాలించే వారికి అధికారాన్ని ఇచ్చామని బాధపడుతున్నారన్నారు. రజతోత్సవ సభలో ప్రతి కార్యకర్త పాల్గొనాలని, ఒక్కో గ్రామం నుంచి 250 నుంచి 300 మందిని తరలించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లెపు రఘుపతిరావు, మండల రూరల్ యూత్ అధ్యక్షుడు పాలకుర్తి రఘుపతి గౌడ్, అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్ యాదవ్, వైస్ చైర్మన్ నాంపల్లి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాసర్ల దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు గౌడ్, నాయకులు మందల రవీందర్ రెడ్డి, సెగ్గం సిద్ధూ, పాషా, సమ్మయ్య, శ్రీకాంత్ పటేల్, భాస్కర్ పాల్గొన్నారు.



సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, నాయకులు, కార్యకర్తలు

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

కురవి, ఏప్రిల్ 10: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ విమర్శించారు. గురువారం సీరోలు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన గ్యారెంటీలను నమ్మి ప్రజలు మోసం పోయారని అన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే ఆ పార్టీని ప్రజలు చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ సభకు 10 వేల మందిని తరలిస్తామని, విజయవంతం చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కురవి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట లాలయ్య, నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, గుగులోత్ రవినాయక్, తేజావత్ భోజ్యానాయక్, పెద్ది వెంకన్న, విజయ్‌పాల్ రెడ్డి, మోహన్‌నాయక్, బీకోజీ నాయక్, హరీశ్, అప్పారావు, హైమావతి, అనిల్ రెడ్డి, జలగం వెంకన్న, మామిండ్ల వెంకన్న, యాకూబ్, నరహరి పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుడు బైరి హరి బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా, రెడ్యానాయక్ కండువా కప్పి ఆహ్వానించారు.

# 15 నెలల్లోనే కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత

- సభకు పెద్ద ఎత్తున జనాన్ని తరలించాలి
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



చిల్పూరు: సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు, ఏప్రిల్ 10 : కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి 15 నెలలవుతున్నా నేటి వరకు ఒక్క సంక్షేమ పథకం పూర్తి స్థాయిలో అమలు కాని పరిస్థితి ఉందని, దీంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేక వచ్చిందని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ర్టాన్ని సస్యశ్యామలంగా మార్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘన్‌పూర్ నియోజకవర్గంలోనే 9 రిజర్వాయర్లను ఏర్పాటు చేసి ప్రతి ఎకరాకు సాగునీరందించిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా నేటి వరకు ఒక్క సంక్షేమ పథకం పూర్తి స్థాయిలో అమలు కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. కడియం శ్రీహరి రూ. 100 కోట్లకు కాంగ్రెస్ పార్టీకి అమ్ముడు పోయారని రాజయ్య ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ జెండాపై గెలుపొందిన శ్రీహరికి దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ జెండాపై పోటీ చేసి గెలుపొందాలని అన్నారు. చిన్న గ్రామాలను పైలట్ పథకం కింద ఎంపిక చేసి నేటి వరకు రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లకు తట్టెడు మట్టి తీసిన దాఖలాలు లేవన్నారు. రజతోత్సవ మహాసభకు బీఆర్‌ఎస్ నాయకులు ప్రతి మండలం నుంచి ఐదు వేల మందిని తరలించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, మాజీ సర్పంచ్ తాటికొండ సురేశ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చల్లా చందర్ రెడ్డి, కనకం గణేశ్, గుర్రం శంకర్, చిట్టిబాబు, చింత శ్రీను, గోవిందు అశోక్, మారపల్లి ప్రసాద్, చిల్పూరు మండల రైతు బంధు మాజీ కోఆర్డినేటర్ జనగామ యాదగిరి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌నాయక్, మాజీ డైరెక్టర్ బత్తుల రాజన్‌బాబు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు నారగోని రాజు గౌడ్, మాజీ ఎంపీటీసీలు మాచర్ల ప్రవీణ్‌కుమార్, ఎడ్ల శ్రీనివాస్, రాజవరం గ్రామ శాఖ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా, నాయకులు నారగోని శ్రీనివాస్, నారగోని వెంకన్న, ఇల్లందుల వెంకటస్వామి, ఎడ్ల మహిపాల్, యూత్ నాయకులు గణపతి, శ్రీనివాస్, శ్రీను, కోటి, వెంకటస్వామి, రవి పాల్గొన్నారు.

## దండం పెడతాం సార్లు..

మా గ్రామాన్ని తరలించండి

# మాకు న్యాయం చేయండి

- ఉపాధి లేక ఉపాసముంటున్నాం.. నీళ్లు లేక అల్లాడుతున్నాం
- పరశురాంపల్లి గ్రామస్తుల వేడుకోలు
- సింగరేణి ఓసీ-3 ప్రాజెక్టు ప్రధాన రహదారిపై ధర్నా
- జీఎం హామీతో ఆందోళన విరమణ

గణపురం, ఏప్రిల్ 10 : కేటీకే ఓసీ-3 నుంచి వచ్చే దుమ్ము, ధూళితో రోగాల పాలవుతున్నామని, తమ వ్యవసాయ భూములు సింగరేణికి అప్పగించడంతో ఉపాధి లేక ఉపాసముంటున్నామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం పరశురాంపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మీకు దండం పెడతాం సార్లు.. మా గ్రామాన్ని త్వరగా తరలించి న్యాయం చేయండి అని వేడుకుంటున్నారు. గురువారం తమకు పునరావాస ప్యాకేజీ అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఓసీ-3 ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత నెల 10న ధర్నా చేసినప్పుడు సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి వచ్చి నెల రోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చి పట్టించుకోవడంలేదన్నారు. చేసేదేమీ లేక గ్రామస్తులందరం కలిసి ఆందోళనకు దిగామన్నారు. ఎంతో విలువైన తమ పొలాలను తీసుకొని గ్రామాన్ని తరలించకపోవడం వల్ల ఉపాధి లేక, తాగునీళ్లు దొరకక అల్లాడిపోతున్నామన్నారు. తమ పిల్లలకు ఉద్యోగాలు దొరికి ఉపాధి లభిస్తుందని ఆశపడ్డామని, ఈ విషయంలో సింగరేణి సంస్థ పూర్తిగా విఫలమైందన్నారు. 2012 నుంచి ఇప్పటి వరకు వినతిపత్రాలు ఇస్తున్నా తమకు న్యాయం జరగడం లేదన్నారు. భూములు తీసుకునే సమయంలో ఉద్యోగాలు, పునరావాస ప్యాకేజీ ఇస్తామని సింగరేణి అధికారులు మాయమాటలు చెపితే భూములిచ్చామన్నారు. అనంతరం సగం ఊరును సింగరేణి సర్వే చేసి అక్కడి వరకే స్థలాలు, ఇండ్లు తీసుకుంటామని ఇప్పటివరకు తీసుకోలేదన్నారు. గ్రామాన్ని మొత్తం తీసుకోవాలన్నారు. బాంబు బ్లాస్టింగ్‌లతో ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని, శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని, బోర్లు వేస్తే ఎత్తిపోయి నీళ్లకు ఇబ్బంది పడుతున్నామన్నారు. గ్రామాన్ని తరలించే వరకు ధర్నాను విరమించేది లేదని మందు డబ్బాలతో రోడ్డుపై బైఠాయించారు. దీంతో అక్కడికి స్థానిక ఎస్సై రేఖ అశోక్‌తో పాటు భూపాలపల్లి, టేకుమట్ల, రేగొండ ఎస్సైలు, పోలీసులు చేరుకున్నారు. అనంతరం సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, అడిషనల్ జీఎం కవీంద్ర, చిట్యాల సీఐ మల్లేశ్‌యాదవ్ అక్కడికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి వారం రోజుల్లో సింగరేణి సీఎండీతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.



ధర్నా చేస్తున్న పరశురాంపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి



జనగామ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం



కొత్తపల్లి పీఆర్ రోడ్డుపై కూలిన చెట్టు

# జనగామలో మోస్తరు వాన

- ఉరుములు, మెరుపులతో వర్షం
- మార్కెట్‌లో స్వల్పంగా తడిసిన ధాన్యం
- గాలులకు రాలిన మామిడికాయలు

జనగామ, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : జనగామ జిల్లాలో ఉరుములు, మెరుపులతో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. భారీ గాలులతో కురిసిన వర్షం చేతికొచ్చిన వరి పంట, మామిడి తోటలకు కొంత నష్టం చేశాయి. రఘునాథపల్లి మండలం కోమాల్ల గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలగూడెం, ఇబ్రహీంపూర్, పత్తేషాపురంలో స్వల్పంగా వడగండ్లు పడ్డాయి. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో అమ్మకానికి తెచ్చిన ధాన్యం రాశులను తేమ పేరుతో వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో చాలా మంది రైతులు యార్డులో ఆరబోసుకున్నారు. అయితే సాయంత్రం వాతావరణంలో వచ్చిన మార్పులతో కొందరు టార్పాలిన్లు కప్పుకోగా, మిగిలిన రైతుల ధాన్యం స్వల్పంగా తడిసింది. లింగాలఘనపురం-నెల్లుట్ల, కొత్తపల్లి పీఆర్ రోడ్లపై చెట్లు కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దేవరుప్పుల మండలం రామరాజుపల్లిలో పిడుగుపాటుకు పాడి గేదె మృతి చెందింది. చినమడూరులో వడగండ్ల వాన కురిసి వరి చేన్లకు నష్టం వాటిల్లింది.

## ఎన్ని కుట్రలు చేసినా

# మహాసభ ఆగదు

- రజతోత్సవ పండుగను విజయవంతం చేయాలి
- అధికార పార్టీ కేసులకు భయపడేది లేదు
- సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 10 : బీఆర్‌ఎస్ రజతోత్సవ సభతో కాంగ్రెస్ పతనం ఖాయమని, సభను అడ్డుకునేందుకు ఎవరెన్ని కుట్రలు చేసినా ఆగదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న గులాబీ పండుగకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్‌లోని జీఆర్‌ఎస్ గార్డెన్‌లో ఆత్మకూరు, దామెర మండలాల బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 27న ప్రతి గ్రామంలో పండుగలా జెండా ఆవిష్కరణ నిర్వహించి సభకు రావాలన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత శ్రేణులపై ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. బీఆర్‌ఎస్‌లో పదవులు అనుభవించి ఇతర పార్టీల్లో చేరిన వారిని ఎట్టి పరిస్థితుల్లో మళ్లీ తీసుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత పార్టీ సీనియర్ నాయకులు రాజకీయాల్లో యువతను ప్రోత్సహించాలన్నారు. అధికార పార్టీ నాయకులు పోలీసులతో అక్రమ కేసులు పెట్టిస్తున్నారని, ఎవరికీ భయపడేది లేదన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. చావు నోట్లో తల పెట్టి కేసీఆర్ తెలంగాణ సాధిస్తే నేడు కాంగ్రెస్ నాయకులు పదవులు అనుభవిస్తున్నారన్నారు. కేసీఆర్, కేటీఆర్ సహకారంతో దేశానికే తలమానికంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో వస్త్ర పరిశ్రమను స్థాపించుకున్నామన్నారు. ఇప్పుడు అందులో పని చేస్తున్న కార్మికులను తొలగించి కాంగ్రెస్ కార్యకర్తలను పెడుతున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ గళం.. బలం.. బలగం బీఆర్‌ఎస్ ఒక్కటేనని, సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని చల్లా పేర్కొన్నారు. సమావేశంలో రెండు మండలాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి